## క్లుప్తంగా

### సమస్యలు పరిష్కరించాలని వినతి



ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావుకు వినతి పత్రం అందజేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

**అరకులోయ రూరల్:** మండలంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల, కళాశాలలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్‌లు తమను రెన్యూవల్ చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులతో కలిసి బుధవారం ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి బాలదేవ్ మాట్లాడుతూ హెల్త్ అసిస్టెంట్లను రెన్యూవల్ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. హెల్త్ అసిస్టెంట్‌లు గంగధార్, లలిత, జానకి, సద్దు, నాగేశ్వరరావు, రామరావు తదితరులున్నారు.

### జోరుగా టవర్ పనులు



పనులను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ రామన్న, నేతలు

**అరకులోయ రూరల్:** బస్కి పంచాయతీ బొండంగూడ గ్రామంలో జరుగుతున్న జియో టవర్ నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ కిల్లో రామన్న బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లు సెల్ టవర్ల కోసం గిరిజనులు ఎదురుచూస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వ సహకారం, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో గిరిజనుల కల నేరువేరుతుందన్నారు. సెల్ టవర్ లేకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడేవారని, టవర్ అందుబాటులో సమస్య పరిష్కారం కానున్నట్టు తెలిపారు. గ్రామస్తులు రఘు, తదితరులున్నారు.

### పీపీఆర్ వ్యాక్సిన్ తప్పనిసరి



గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

**దుంబ్రిగుడ:** గొర్రెలు, మేకలకు తప్పనిసరిగా పీపీఆర్ వ్యాక్సిన్ వేయించాలని పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి గౌతమ్ అన్నారు. మండలంలోని అరకు సంతబయలు, నేరేడు వలస గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మేకలు, గొర్రెలకు వ్యాధులు సోకకుండా ముందుస్తుగా వ్యాక్సిన్ వేయించాలని రైతులకు సూచించారు. ఆయా గ్రామాల్లో 120 పశువులకు వ్యాక్సిన్ వేసినట్టు చెప్పారు. సిబ్బంది, రమేష్, సంజీవ్, అప్పారావు, ప్రకాష్, మహేష్, మనోజ్ పాల్గొన్నారు.

### సంతలో రామఫలానికి డిమాండ్



వారపు సంతలో విక్రయిస్తున్న రామఫలాలు

**అనంతగిరి:** మన్యంలో పండే రామఫలానికి డిమాండ్ నెలకొంది. మండలంలోని డముకు వారపు సంతలో బుధవారం రామఫలాలు విక్రయాలు జోరందుకున్నాయి. గిరిజనులు తెచ్చిన రామ ఫలానికి డిమాండ్ ఉండడంతో మైదాన ప్రాంతాల వ్యాపారులు వీటిని కొనుగోలు చేశారు. నిమ్మలపాడు, వాలసీ, గుమ్మ, పెదబిడ్డ పంచాయతీల నుంచి గిరిజనులు రామపండ్లను సంతకు అధిక సంఖ్యలో తీసుకొచ్చారు. ఒక్కో పండు సైజును బట్టి రూ.5 నుంచి రూ.10 వరకు కొనుగోలు చేసినట్టు రైతులు చెప్పారు. అయితే మైదాన ప్రాంతాల్లో వీటిని రూ.15 నుంచి రూ.20 పైగా అమ్మకాలు చేపడతామని వ్యాపారులు తెలిపారు.



# శరవేగంగా 'హై'వే

- ఐ.పోలవరం నుంచి కాకరపాడు వరకు ఎన్‌హెచ్‌- 516-ఈ పనులు
- గిరిజనుల కల సాకారమైన వేళ
- మండలంలో పూర్తయిన భూ సేకరణ



పొలాల మధ్య నుంచి రూపుదిద్దు కొంటున్న ఎన్‌హెచ్ 516ఈ రహదారి పనులు

**రాజవొమ్మంగి:** మన్యంలో ఇరుకైన రహదారులు, గంటల తరబడి ట్రాఫిక్ జామ్.. ఇదంతా నాటి కష్టాలు.. ప్రస్తుతం మన్యంలోని రహదారులకు మహర్దశ చేకూరింది. రాష్ట్ర ప్రభుత్వం శివారు గ్రామాల్లోనూ రోడ్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం అల్లూరి జిల్లా మీదుగా మన్యం పార్వతీపురం వరకు జాతీయ రహదారి పనులు ప్రారంభించింది. ఇందులో భాగంగా రంపచోడవరం నియోజకవర్గంలోని రాజవొమ్మంగి మండలంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

**34 గ్రామాల మీదుగా జాతీయ రహదారి**

రాజవొమ్మంగి సమీపంలో ఐ.పోలవరం నుంచి కొయ్యూరు మండలం కాకరపాడు జంక్షన్ వరకు దాదాపు 72 కిలోమీటర్ల మేర 516ఈ జాతీయ రహదారి నిర్మాణ పనులు జోరందుకున్నాయి. సుమారు 34 గ్రామాల మీదుగా రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఈ మేరకు రోడ్డు పనుల్లో భాగంగా వృక్షాలు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పొలాలను తొలగించనున్నారు. ఇందుకు సంబంధించి నిబంధనల మేరకు నష్టపరిహారం అందజేయనున్నారు. రోడ్డు నిర్మాణానికి 251.8 హెక్టార్ల భూమి అవసరం కాగా, ఇప్పటికే ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు 135 హెక్టార్ల భూమిని నేషనల్ హైవే అథారిటీకు అప్పగించారు. ఇంకా 56 హెక్టార్ల ప్రభుత్వ భూమి, 61 హెక్టార్ల ప్రయివేటు భూమి రోడ్డు నిర్మాణానికి అవసరమున్నట్టు అధికారులు గుర్తించారు. ఇదిలా వుండగా ఎటువంటి భూ సమస్యలు లేని చోట హైవే పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా మండలంలోని చెరకుంపాలెం, జడ్డంగి, వట్టిగెడ్డ, దూసరపాము, రాజవొమ్మంగి, శరభవరం, బోయపాడు జంక్షన్ల మీదుగా ప్రతి నిముషం సాగే వాహనాల రాకపోకలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా పక్కాగా డైవర్షన్ రహదారులు నిర్మించారు. కొండవాగులు ప్రవహించే చోట రహదారికి వాలుగా కల్వర్టుల నిర్మాణాలు జరగుతున్నాయి. మరికొన్ని చోట్ల ఏకంగా బీటీ రోడ్ నిర్మాణం పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయి. రోడ్డు పనులకు కావల్సిన తారుమిక్సర్ తయారీ యూనిట్, అతి పెద్ద మెటల్ క్రషర్ యూనిట్‌ను జడ్డంగి సమీపంలో నిర్మిస్తున్నారు. రోడ్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుండడంతో హైవే మన్యానికి మణిహారం కానుంది.



జడ్డంగి సమీపంలో జరుగుతున్న పనులు

**త్వరితగతిన భూ సేకరణ**



మండలంలోని నిర్మించనున్న హైవే కోసం భూమిని సేకరిస్తున్నాం.ఇందులో చాలా వరకు ఆర్అండ్‌బీకు చెందిన స్థలాలు ఉన్నాయి. ఇప్పటికే భూసేకరణ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం భూసేకరణ, నష్టపరిహారం లెక్కింపు పనులు జరుగుతున్నాయి. నిబంధనల మేరకు భూ నిర్వాసితులకు నష్ట పరిహారం అందజేస్తారు. – సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్, రాజవొమ్మంగి

**నివేదిక అందజేశాం**



మండల పరిధిలో నిర్మించనున్న 516–ఇ హైవే పనులకు సంబంధించి తొలగించనున్న వృక్షాలు, స్థలాలు, పొలాలు, గృహాలు తదితర అంశాలపై నివేదికను అందజేశాం. నష్టపరిహారం చెల్లించిన తరువాత ఆయా భూములను హైవే అథారిటీకీ అప్పగిస్తాం. ఇందులో చాలా వరకు ఆర్అండ్‌బీకు చెందినదే ఉంది. – చక్రవర్తి, ఎన్‌హెచ్, ఏఈ

### హైందవ ధర్మ పరిరక్షణకు కృషి

**గూడెంకొత్తవీధి:** రింతాడ పంచాయతీ అసరాడలో విశ్వశాంతి జ్యోతిర్మయిబాబా ఆశ్రమంలో గిరిజన అర్చకుల సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ హైందవ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఆశ్రమం ధర్మకర్త ఎస్.రామారావు,అర్చక సంఘం నేత సింహాచలం, వీహెచ్‌పీ మండల ధర్మ ప్రచారకులు చిన్నభాయి, చిన్నారావు, శేఖర్, సత్యనారాయణ, వెంకటరమణ, ఈశ్వరమ్మ, భారతి, సరస్వతి, భక్త బృందం పాల్గొన్నారు.

### గృహసారథులు, కన్వీనర్లతో రేపు సమావేశం

**రాజవొమ్మంగి:** సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దూసరపాము గ్రామంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు రాజవొమ్మంగి-1, రాజవొమ్మంగి-2, దూసరపాము, తంటికొండ, శరభవరం, బడదనాంపల్లి, కింద్ర, లబ్బర్తి గ్రామాలకు చెందిన కన్వీనర్లు, గృహ సారథులతో సమీక్షా సమావేశం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు అమీనాబాద్ గ్రామంలో వంచంగి, అమీనాబాద్, జడ్డంగి, చెరకుంపాలెం, గడుఓకుర్తి, లోదొడ్డి, వాతంగి, చికిలింత సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. విధిగా హాజరు కావాలని కోరారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



బాధితులకు నగదు సాయం చేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

**కొయ్యూరు:** మండలంలోని అంతాడ పంచాయతీ తాటిమానిపాలెంలో గ్యాస్ లీకై న కారణంగా నాలుగు పూరిల్లు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన స్థలాన్ని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఘటనలో సర్వం కోల్పోయిన బాధితులకు ఆమె రూ.10వేల నగదు, నిత్యావసర సరకులను తక్షణ సాయంగా అందజేశారు. దీంతో పాటు కె.చిట్టినాయుడు ట్రస్ట్ నుంచి మరో రూ.20 వేల నగదును, నిత్యావసర సరకులను బాధిత కుటుంబాలకు ఇచ్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధితులైన వారిలో వలంటీర్ కుటుంబం, సచివాలయలో పనిచేస్తున్న వారి కుటుంబాలు ఉన్నాయని ఎమ్మెల్యేకు స్థానికులు వివరించారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు గజ్జయ్యదొర, నూకాలు, బాబులు, చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, పార్టీ మండల మహిళా విభాగ అధ్యక్షురాలు సావిత్రి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, సత్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలి నాయుడు, సర్పంచ్‌లు ఉన్నారు.

## సీతంరాజు గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**అనంతగిరి:** ఉత్తరాంధ్ర జిల్లా అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కాశీపట్నం గ్రామంలోని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీపీ శెట్టి నీలవేణితో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని పది మందితో కూడిన బృందాన్ని ఏర్పాటు చేస్తున్నామని, పర్యవేక్షణ బాధ్యతను ఎంపీపీ శెట్టి నీలవేణి అప్పగించినట్టు చెప్పారు.. తగు సూచనలు చేసి, ముందుకు నడిపించాలన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూర్యానారాయణ, సర్పంచ్‌లు చిరంజీవి, సీతయ్య, కో–ఆప్షన్ సభ్యుడు మదీనా తదితరులు పాల్గొన్నారు.

**అరకులోయ రూరల్:** మండలంలోని బస్కి పంచాయతీలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్ బుధవారం చేపట్టారు.

ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు అందరూ కృషి చేయాలన్నారు. పార్టీ శ్రేణులు గ్రామాల్లో పర్యటించి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మజ్జి గురు తదితరులున్నారు.

## ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు గిరిజన సంఘం నాయకుల వినతి



ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబుకు వినతి పత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

**పాడేరు రూరల్:** గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రక్రియను ఉపసంహారించుకోవాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 20 మంది విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలలను విలీనం చేయాలనే ఆలోచన కారణంగా ఏజెన్సీలో విద్యార్థుకు అధిక నష్టం వాటిల్లుతుందన్నారు. సమస్య పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. నాయకులు లోకనాథం, జగ్గునాయుడు, గంగరావు, అంబేడ్కర్ తదితరులున్నారు.

## పాఠశాల పనులు ప్రారంభమెన్నడో?

- పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు
- ముందుకు సాగని పనులు

**గంగవరం:** మండలంలోని టేకులవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో వసతి సమస్య వెంటాడుతోంది. సూరంపాలెం రిజర్వాయర్ నిర్మాణంలో టేకులవీధి గ్రామం ముంపునకు గురికావడంతో గ్రామానికి చెందిన నిర్వాసితులను, పాఠశాలలను కొత్తాడ పునరావాస కాలనీకి తరలించారు. అప్పట్లో టేకులవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ ప్రాథమికోన్నత పాఠశాలకు అరకొర భవనాలు నిర్మించి పాఠశాలను ఇక్కడకి తరలించారు. నాడు–నేడు ద్వారా పాఠశాల భవనం, మరుగుదొడ్లను అభివృద్ధి చేశారు. అయితే పాఠశాలలో భోజనశాల, ప్రహరీ సౌకర్యాల కల్పనకు గతేడాది సుమారు రూ.50లక్షల నిధులను గిరిజన సంక్షేమ శాఖ మంజూరు చేసినా నేటి వరకు పనులు ప్రారంభించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. పాఠశాలలో అరకొర సదుపాయాలతో తమ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారంటున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై పాఠశాల హెచ్‌ఎం అప్పలనాయుడు మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.



టేకులవీధి ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల

## చిరుధాన్యాలదే భవిష్యత్

కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజకుమార్

**అనకాపల్లి రూరల్ :** మండలంలోని తుమ్మపాలలో శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి, నాబార్డు ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ చిరుధాన్య మహోత్సవాల్లో భాగంగా చిరుధాన్యాల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్త డాక్టర్ రాజకుమార్ మాట్లాడుతూ రానున్న కాలంలో చిరుధాన్యాలపైనే అందరూ ఆధారపడాల్సి ఉంటుందన్నారు. చిరుధాన్యాల సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పూర్తి సహకారం అందుతోందన్నారు. ఆరోగ్యకర జీవనానికి చిరు ధాన్యాలు ఎంతో ఉపకరిస్తాయని తెలిపారు. చిరుధాన్యాలతో చేసిన వంటలను ప్రోత్సహించాలన్నారు. చిరుధాన్య పదార్థాల తయారీ కోసం ఇస్తున్న శిక్షణను మహిళలు సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి కార్యదర్శి కర్రి జోగినాయుడు మాట్లాడుతూ అనకాపల్లి మండల పరిధిలో ప్రజల జీవనోపాధి పెంపొందించడంలో సంస్థ ఎల్లప్పుడూ సహకరిస్తుందన్నారు. అనకాపల్లిలో సుసాగ్ ఆరోగ్య చిరుధాన్యాల బ్యాంకు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. 15 రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగనున్నట్టు తెలిపారు. ఈ శిక్షణలో దర్జీనగర్, మామిడిపాలెం, ఊడేరు, అనకాపల్లి, తుమ్మపాల, బవులవాడ, పాపయ్యపాలెం , సంతపాలెం, మాకవరం, ఓంద్రం, కుంచంగి గ్రామాల్లోని మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### రవిబాబుకు అభినందనలు



కుంభా రవిబాబుకు అభినందనలు తెలియజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ వెంకటలక్ష్మి

**సాక్షి,పాడేరు:** గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిఫార్సు చేయడంపై వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె బుధవారం విశాఖలో రవిబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మాజీ ఎంపీపీ వెంకటగంగరాజు తదితరులున్నారు.

**ముంచంగిపుట్టు:** రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబుకు వైఎస్సార్‌సీపీ తరపున గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిఫార్సు చేయడం హర్షణీయమని మాజీ ఎంపీపీ వెచ్చంగి పద్మ చెప్పారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందన్నారు. మాజీ ఎంపీటీసీ గెన్ను, మాజీ సర్పంచ్ కేశవరావు పాల్గొన్నారు.

### వీఆర్వో మృతికి సంతాపం



శంకరరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీపీ నీలవేణి

**అనంతగిరి:** రొంపల్లి పంచాయతీలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న కాశీపట్నం గ్రామానికి చెందిన కొఠారి శంకరరావు అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీపీ శెట్టి నీలవేణితో కలిసి బుధవారం కాశీపట్నం గ్రామానికి చేరుకున్నారు. శంకరరావు మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంచి వ్యక్తిని కోల్పోయామంటూ ఎమ్మెల్యే పాల్గుణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్వోకు నివాళులర్పించిన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూర్యనారయణ, సర్పంచ్‌లు సీతయ్య, చిరంజీవి, కో–ఆప్షన్ సభ్యుడు మదీనా, నాయకులు గంగులు, స్వామి ఉన్నారు.

### దారమఠం హుండీ ఆదాయం రూ. 3.27 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దేవదాయశాఖ అధికారులు

**గొలుగొండ:** ప్రముఖ శైవక్షేత్రమైన దారమఠానికి మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా రూ. 3.27 లక్షల ఆదాయం వచ్చింది. ఈ మేరకు బుధవారం దేవదాయ శాఖ అధికారులు లెక్కింపు నిర్వహించారు. మహా శివరాత్రి మూడు రోజుల పాటు హుండీ, దర్శనం టిక్కెట్లు, ఇతర రూపాల్లో ఈ ఆదాయం సమకూరినట్లు ఈవో మురళి తెలిపారు. ఈ నిధులు దేవదాయ శాఖకు జమ చేస్తున్నట్లు చెప్పారు. మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

### సంతోషిమాత తీర్థం రేపు

**మాడుగుల రూరల్:** కేజేపురం జంక్షన్‌లో సంతోషిమాత తీర్థం 24వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నసమారాధన జరుగుతాయన్నారు. కబడ్డీ, ముగ్గుల పోటీ లు, సాయంత్రం సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## వృద్ధులకు ఆర్థిక సాయం



వృద్ధులకు పింఛన్ నగదు అందజేస్తున్న వైద్యాధికారి భాస్కర్ తదితరులు

**అడ్డతీగల:** ఆసరాలేని నిరుపేద వృద్ధులకు ఏదో విధంగా తోడ్పాటు అందించాలని ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యాధికారి భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం 'సాక్షి' స్వచ్ఛంద సంస్థ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అడ్డతీగలతో పాటు సమీప ప్రాంతాలకు చెందిన 40 మంది వృద్ధులకు సాక్షి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేవాభావంతో ప్రతి నెల ఒక్కొక్కరికీ రూ.200 పింఛన్‌గా నగదుతో పాటు వారికి భోజనం అందజేస్తున్నట్టు చెప్పారు. రానున్న వేసవిలో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వృద్ధులకు వివరించారు. తగిన ఆరోగ్య సూచనలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. సమాజంలో నిరాదరణకు గురౌతున్న వృద్ధులను చేరదీసి వారిలో మానసిక ఉల్లాసాన్ని కల్గించాలనే సదుద్దేశ్యంతో ప్రతి నెల ఇటువంటి కార్యక్రమాన్ని చేపడుతున్నామని సాక్షి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.ఆరోగ్యరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా వృద్ధులు ఒక్కొక్కరికీ రూ.200 నగదుని వైద్యాధికారి భాస్కర్ చేతుల మీదగా అందజేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం సక్రమంగా అందించాలి



పనసబంద అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న సీడీపీవో బాలచంద్రమణి దేవి

**హుకుంపేట:** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన పౌష్టిక ఆహారాలు సక్రమంగా అందించాలని సీడీపీవో బాలచంద్రమణి దేవి అన్నారు. బుదవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'డోలిలో తరలించినా దక్కని శిశువు' అనే వార్తకు స్పందించి పనసబంద, కిన్నెర్లోవ గ్రామాల్లో సీడీపీవో బాలచంద్ర మణిదేవి సందర్శించారు. ఇందులో భాగంగా మంగళవారం జరిగిన సంఘటనలో శిశువు పోగొట్టుకున్న గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. అంగన్‌వాడీ కేంద్రంలో సందర్శించారు. సరకులు, రికార్డులు తనిఖీ చేశారు. శిశువు మృతి చెందడంపై గల కారణాలు, కేంద్రం నుంచి పౌష్టికాహారం పంపిణీ విషయాలను అంగన్‌వాడీ కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాఎ మాట్లాడుతు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సక్రమంగా అందించాలన్నారు. అనంతరం దిగుడుపు గ్రామంలో సందర్శించారు. చిన్నారులకు టీకాలు, ఆరోగ్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లల పరిశుభ్రత, వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఆమెతో పాటు సూపర్‌వైజర్ హసీనా తదితరులున్నారు.

### అల్లూరి విగ్రహానికి ముసుగు



అల్లూరి విగ్రహానికి ముసుగు వేసిన మున్సిపల్ సిబ్బంది

**నర్సీపట్నం:** ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది రాజకీయ నాయకుల విగ్రహాలతో పాటు విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ముసుగు తొడిగారు. ఈ సంఘటన బుధవారం నర్సీపట్నంలో చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ అధికారుల ఆదేశాలతో వార్డు సచివాల యం సిబ్బంది పట్టణంలో విగ్రహాలకు ముసుగు లు వేసే కార్యక్రమం చేపట్టారు. అయితే అల్లూరి విగ్రహానికి ముసుగు వేయటంపై దారిన వెళ్లే వారు ముక్కున వేలేసుకున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు ముసుగును తొలగింపజేసి జరిగిన పొరపాటును సరిదిద్దుకున్నారు.

### వాహన తనిఖీలు



వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఐ షరీఫ్

**రాజవొమ్మంగి:** మండలంలోని జడ్డంగి, చెరకుంపాలెం సెంటర్లలో ఎస్ఐ షరీఫ్ బుధవారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. లైసెన్స్, వాహనం ఇన్సూరెన్స్ ఇతర పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేసి రసీదులు ఇచ్చారు. రోడ్డు ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సిబ్బంది ఉన్నారు.

## 25 నుంచి గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

**రోలుగుంట:** ఈ నెల 25 నుంచి కొవ్వూరు గ్రామంలో నాలుగు రోజుల పాటు శ్రీ గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలకు నిర్వాహకులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నిర్వహకులు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 25న ఉత్సవమూర్తులను భక్తుల సందర్శనార్థం ఉత్సవ స్థలంలోని పల్లకిలో ఉంచుతామన్నారు. నాలుగు రోజులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాల విజయవంతానికి గ్రామస్థులతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చే బంధువులు ఉత్సవ కమిటీకి సహకరించాలని నిర్వాహకులు కోరారు.

### నేడు కాశీ విశ్వేశ్వరుని కల్యాణం

**మునగపాక:** స్థానిక కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో గురువారం విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణ మహో త్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ సూరిశెట్టి రాము, కోశాధికారి వేగి సాయిబు నాయుడు తెలిపారు. ఆల య ప్రాంగణంలో ఉద యం 11.22 గంటలకు వేద పండితులు సోమశేఖర శర్మ ఆధ్వర్యంలో కల్యాణం జరుగుతుందని తెలియజేశారు.